# అమెరికాలో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పుస్తక ఆవిష్కర

06-07-2016 10:30:35




**డల్లాస్:** భారత స్వాతంత్ర్యానికి అహింసాయుధంతో సుదీర్ఘ పోరాటం చేసిన మహాత్మగాంధీ బోధనలు, ఆదర్శాలే నేటి ప్రపంచానికి మార్గదర్శనాలని పద్మభూషణ్ పురస్కార గ్రహీత, మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. అమెరికాలో జరుగుతున్న ఆటా రజతోత్సవాల కోసం అమెరికా వెళ్లిన యార్లగడ్డ ఆ దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డల్లాస్‌లోని మహాత్మా గాంధీ స్మారకస్థలం వద్ద ఘననివాళులు అర్పించారు.

తాను అమెరికా అధ్యక్షుడిని కావడానికి గాంధీజీ బోధనలే కారణమని అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా భారత్‌లో పర్యటించినప్పుడు చెప్పారని అన్నారు. ఐసిస్ ఉగ్రమూకల చర్యలతో అట్టుడుకుతోన్న నేటి ప్రపంచానికి గాంధీజీ సిద్ధాంతాలే సరైన పరిష్కారమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పెద్ద ఎత్తున చేపడుతున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమం గాంధీజీ నుంచి స్ఫూర్తి నుంచి రూపొందించేదనని యార్లగడ్డ అన్నారు. ఈ సందర్భంగా యార్లగడ్డ రచించిన ''దక్షిణాఫ్రికాలో మహాత్మోదయం'' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

అమెరికాలో అతిపెద్ద గాంధీ విగ్రహంగా ఖ్యాతికెక్కిన డల్లాస్‌లోని గాంధీ స్మారకస్థలి వద్ద అమెరికా స్వతంత్ర దినోత్సవం నాడు కలుసుకోవడం, ఇదే వేదిక వద్ద గాంధీపై పుస్తకాన్ని ఆవిష్కరించడం గౌరవంగా భావిస్తున్నామని డల్లాస్ మహాత్మా గాంధీ స్మారకస్థలి కార్యవర్గ అధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో టాంటెక్స్ అధ్యక్షుడు జొన్నలగడ్డ సుబ్బు, కృష్ణా ఎన్నారై అధ్యక్షుడు పొన్నూరు సుబ్బారావు, తాతినేని రాం, స్మారకస్థలి కార్యవర్గ సభ్యులు కల్వల రావు, షబ్నం, సీ.ఆర్.రావు తదితరులు పాల్గొన్నారు.